జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 75 | గురువారం 7 ఆగస్టు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## దేశ పాలనకు గుండెకాయ.. కర్తవ్య భవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



ఆగస్టు 6 (సందేశం టైమ్స్): సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కర్తవ్య భవన్‌ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. కర్తవ్య భవన్ లోకి దశలవారిగా కేంద్ర మంత్రుల కార్యాలయాలను తరలిస్తారు. ప్రస్తుతం హోంశాఖతో పాటు విదేశాంగ శాఖ కార్యాలయాలను నార్త్ బ్లాక్ నుంచి కర్తవ్య భవన్ లోకి మార్చారు. కర్తవ్యభవన్‌లో మంత్రుల కార్యాలయాలను ప్రధాని మోదీ స్వయంగా పరిశీలించారు. భారతదేశ పాలనకు గుండెకాయలా నిలిచిన కొన్ని భవనాలు వాటి స్థితి మార్చుకుంటున్నాయి. ఈ మధ్యనే భారత ప్రభుత్వం కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని నిర్మించి, వందేళ్ల క్రితం నాటి రాతి కట్టడం నుంచి కార్యకలాపాలను కొత్త భవనానికి మార్చేసింది. ఈ క్రమంలోనే మరికొన్ని కీలక పాలన కార్యాలయాలు సైతం రాతి కట్టడాలను వీడి కాంక్రీట్ భవనాల్లోకి మారనున్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కర్తవ్య భవన్‌ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఇప్పటి వరకు రైసీనా హిల్స్‌పై కొలువైన నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉండే ప్రధాని కార్యాలయం సహా రక్షణశాఖ, విదేశాంగ శాఖ, ఆర్థిక శాఖ, హోంశాఖ మంత్రిత్వ శాఖలు త్వరలో అక్కడి నుంచి ఖాళీ కానున్నాయి. వాటిని కొత్తగా నిర్మించిన కర్తవ్య భవన్‌కు తరలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ కీలక శాఖలకు కేంద్రంగా నిలిచే కొత్త భవనం కర్తవ్య భవన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆరంతస్థుల ఈ భవనంలో 1.5 లక్షల చదరపు మీటర్లు ఉంది. ఇందులో హోం, విదేశాంగ శాఖలు ఉండనున్నాయి.

## మా అన్నకు రాఖీ కడతా అందులో సందేహం లేదు



ఆగస్టు 6 (సందేశం టైమ్స్): భారతీయ సంస్కృతిలో సోదరుడు–సోదరి బంధం ఒక ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ఈ పవిత్రమైన బంధానికి ప్రతీక రక్షా బంధన్ పండుగ. ప్రతి సంవత్సరం శ్రావణ మాస పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కడుతూ ప్రేమ, అనుబంధాన్ని వ్యక్తపరుస్తారు. ఈ సందర్భంలో సోదరుడు తన సోదరికి జీవితాంతం రక్షణగా, అండగా ఉంటానని హామీ ఇస్తాడు. ఈ పండుగలో పేద, ధనిక, సామాన్యులు, ప్రముఖులు అనే తేడా ఉండదు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక దినాన్ని ఆనందంగా జరుపుకుంటారు.రాఖీ పండుగ అంటే ప్రతి ఒక్కరికీ తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. చిన్నప్పటి నుంచీ సోదరుడు–సోదరి మధ్య ఉన్న తీపి తగాదాలు, ఆటపాటలు, అనుబంధం ఈ రోజు మరింత బలపడుతుంది.

## రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం.. సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అంత కదం తొక్కారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలుకు ధర్నా చేపట్టారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు వదలము అని నినదాలు చేశారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు.

బిల్లును ఆమోదించలేదు..బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి.. రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రపతి బిల్లును ఆమోదించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు..బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో దేశంలోనూ జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని మోదీ, అమిత్‌షా చెప్పి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.కేంద్రంపై విమర్శలు..బీసీ బిల్లు ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రానికి బిల్లు పంపి 4 నెలలు అవుతున్నా ఆమోదించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తున్నా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు.

## బీసీ రిజర్వేషన్లతో బీజేపీకి సంబంధం లేదు.. కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



ఢిల్లీ,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): నగరంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ దే బాధ్యత.. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.

## సీఎంపై రాజగోపాల్ రెడ్డి విమర్శలు.. స్పందించిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ



ఢిల్లీ:ఆగస్టు 6 (సందేశం టైమ్స్): సీఎం రేవంత్ రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే.. తాజాగా రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.సీఎం రేవంత్ రెడ్డిని రాజగోపాల్ రెడ్డి విమర్శించడంపై ఉన్న కారణం ఏంటో తెలుసుంటామని మల్లు రవి తెలిపారు. రేపు రాజగోపాల్ రెడ్డితో మాట్లాడి వివరాలు తీసుకుంటామని చెప్పారు. రాజగోపాల్ రెడ్డితో మాట్లాడిన తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం ఉటుందని స్పష్టం చేశారు. అన్ని విషయాలపై రాజగోపాల్ రెడ్డి నుంచి త్వరలోనే వివరణ తీసుకుంటామని పేర్కొన్నారు. రెండు రోజులగా బీసీ ధర్నా ఏర్పాట్లలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను ఎవరు పట్టించుకోకపోయినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని మల్లు రవి తేల్చి చెప్పారు.

## బీసీ బిల్లుతో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుంది : భట్టి విక్రమార్క



ఢిల్లీ,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బిల్లు ఆమోదం కోసం నినాదాలు చేస్తూ.. జంతర్ మంతర్ వద్ద బైఠాయించారు.ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు.

బీసీ బిల్లుకు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరిగితే.. దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేయగలరా.. అని ప్రశ్నించిన ప్రతిపక్షాలకు కులగణన చేసి చూపెట్టారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతో సైంటిఫిక్‌గా సర్వే చేసినట్లు చెప్పుకొచ్చారు. బిల్లు అమలు అయితే.. 42 శాతం విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఆమోదం తెలుపాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈ బిల్లుతో ఓబీసీల కల నెరవేరాలని ఆకాంక్షిస్తున్నట్లు భట్టి చెప్పారు.

### డీకే శివకుమార్‌తో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భేటీ..

హైదరాబాద్ :ఆగస్టు 6 (సందేశం టైమ్స్): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్లో.. ఇరువురు భేటీ అయ్యారు. రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.అయితే తాజాగా రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని తెలిపారు. కాంగ్రెస్‌లో తనని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని కుండబద్దలు కొట్టారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగానికైనా రెడీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే గత కొన్నిరోజులుగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ లో తెలంగాణ కాంగ్రెస్ మహా ధర్నా

## పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,



### ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,
### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,
### మంత్రులు, ఇండియా బ్లాక్
### ఎంపీలు,ఎమ్మెల్యేలు,ఎంఎల్సీలు, నాయకులు.
### కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6ఆగస్టు: బీసీ రిజర్వేషన్లను 42% శాతానికి పెంచుతూ ఆ బిల్లు కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన బీసీ లకు 42% రిజర్వేషన్లు కల్పించే దిశగా నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి ఆ బిల్లును పార్లమెంటు కు పంపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించే విషయంలో అలసత్వం చూపడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. బీసీ రిజర్వేషన్ లకు కేంద్ర ప్రభుత్వం ఆవెూదించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6ఆగస్టు సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం 111 డివిజన్ భారతి నగర్ లో ఈరోజు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్. జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి. స్వీట్లు పంచుకున్నారు. 111. డివిజన్ వార్డ్ ఆఫీస్ లో కార్పెంటర్ సింధు ఆధార్స్ రెడ్డి ఈరోజు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ టి యు పి సి లీడర్ మహమ్మద్ అలీ ఖురేషి మండల అధ్యక్షులు ఈ యొక్క కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట అంజయ్య యాదవ్,షేక్ కుత్బుద్దిన్,షేక్ గౌసుద్దీన్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తదితరులు హాజరయ్యారు

## రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.



### రిసర్వే ప్రాజెక్టులో అన్ని రికార్డులు జియో ట్యాగింగ్ చేయాలి
### జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య,

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6ఆగస్టు: భూముల రి సర్వే పైలట్ ప్రాజెక్టుతో భూ సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ పి . ప్రావిణ్య అన్నారు. బుధవారం అందోల్ ఆర్డీవో కార్యాలయాన్ని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ జిల్లా అధికారి ఐనేష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూముల రి సర్వే కోసం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ఆందోల్ డివిజన్ వట్టిపల్లి మండల పరిధిలోని షాహేద్ నగర్ (గట్టుపల్లి) గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే పైలట్ ప్రాజెక్టు పురోగతిపై కలెక్టర్ సమీక్ష జరిపారు. రిసర్వే పైలెట్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత తుది రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. పహానిలు, మోకాపై ఉన్న రైతుల వివరాలు, ల్యాండ్ అక్యుపేషన్ ప్రక్రియ భూముల రీమార్కులు వంటి అంశాలపై మినిట్ స్థాయిలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆమె ఆదేశించారు. భవిష్యత్తులో భూముల విషయంలో ఉన్న సందిగ్ధతకు ఈ రిసర్వే ప్రాజెక్టు ఒక తుది నివేదికల నిలవాలని కలెక్టర్ సూచించారు. రిసర్వే కు సంబంధించిన అన్ని రికార్డులు జియో ట్యాగింగ్ చేయడం, భూహక్కుల వివరాలు డిజిటల్ రూపంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ ఆర్ డి ఓ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)మాధురి. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ సహాయ సంచాలకులు ఐనేష్ , ఆందోల్ ఆర్డీవో పాండు, ఆందోల్ తాసిల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీడీవో రాజేష్ కుమార్, ఐ ఈ ఆర్ పి అధికారి విజయ చారి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీమాతో ధీమాగా ఉండండి

### -ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్లు



సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి,6 ఆగస్టు : ప్రతి ఒక్కరూ బీమా పొంది కుటుంబాలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన బీమాపై ప్రజలకు కొల్చారం, పోతన్ శెట్టిపల్లి కెనరా బ్యాంక్ బ్యాంక్ మేనేజర్లు బుధవారం అవగాహన కల్పించారు.భీమా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 18 సంవత్సరాల నిండిన వ్యక్తుల నవెూదు చేసుకోవచ్చు జీవన్ జ్యోతి బీమాలో సంవత్సరానికి రూ.436 చొప్పున 50 సంవత్సరాల లోపు చెల్లిస్తే 2 లక్షల బీమా వస్తుందని, సురక్ష బీమా సంవత్సరానికి రూ.20 చొప్పున చెల్లిస్తే 70 సంవత్సరాల వరకు యాక్సిడెంటల్ గా మరణిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని బ్యాంక్ మేనేజర్లు శ్రావణ్ కుమార్, రాకేష్ కుమార్లు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బీమా చేసుకునేవారు బ్యాంకులో ఖాతా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ పేద ప్రజలకు ఆదుకోవాలన్న ఉద్దేశంతో నిరుపేద రైతులకు బీమా సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రతి రైతులు, ప్రజలు ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన బీమా యోజన పొంది తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు, మహిళలు ఉన్నారు.

## ఇచ్చిన హామీ నెరవేర్చి పెన్షనర్లను ఆదుకోవాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ



సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ అన్నారు. బుధవారం కౌడిపల్లి మండలం కంచన్ పల్లి, బూరుగడ్డ, మహమ్మద్ నగర్ గ్రామాల పెన్షన్ దారులతో కలిసి మహమ్మద్ నగర్ గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ , చేనేత కార్మికులు, ఇతర పింఛన్దారులకు ప్రభుత్వం 2 వేల పెన్షన్ 4 వేలు,6వేల పెన్షన్ దారులకు 16వేలూ ఇస్తానన్న రేవంత్ రెడ్డి సర్కార్ మాట మార్చిందని ఆరోపించారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు వేతనాలు పెంచుకుంటున్నారు కానీ ఓట్లు వేసి గెలిపించిన పెన్షన్ దారులకు మాత్రం ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని విమర్శించారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి పెన్షన్ దారులను ఇబ్బందులకు గురి చేయకుండా ఆదుకోవాలని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్ పెంపుదల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల మండల అధ్యక్షుడు భిక్షా నాయక్, మల్లేష్ యాదవ్, నవనీత, స్వరూప, మల్లేష్, పెన్షన్ దారులు ఉన్నారు.

## నర్సాపూర్ రెడ్డిపల్లి పీహెచ్ సీ వైద్య సేవలు బేష్



సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 6: సమయ పాలనలో జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల, వైద్యాధికారులు, సిబ్బంది. తీరు అభినందనీయం.నర్సాపూర్ రెడ్డి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని వేగం పెంచాలని, సత్ఫలితాలను ఇచ్చే దిశగాప్రత్యేక పాశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. నర్సాపూర్ రెడ్డిపల్లి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన. పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపి రిజిస్టర్ డెలివరీ రిజిస్టర్, మందుల స్టాక్ వివరాలు, సుదీర్ఘంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ. పురోగతిని పరిశీలించి త్వరితగతిన ఇండ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం దశలవారీగా బిల్లు జమ చేస్తారని సొంతింటి కల నెరవేర్చుకోవాలని లబ్ధిదారులకు . పలు సూచనలు చేశారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించి డ్రై డే యాక్టివిటీ పటిష్టంగా అమలు కావాలని నీరు నిలవ ఉండకూడదని, దోమలు లార్వాలు వృద్ధి చెందకూడదని, మలేరియా డెంగ్యూ జిల్లాలో దరిదాపులు కూడా రాకూడదని ప్రజారోగ్యాన్ని రక్షించడంలో నిరంతరం శ్రమించాలన్నారు. నీరు నిల్వ ఉన్న పాత టైర్లు, గోళాలు, ఆయన పరిశీలించి దగ్గరుండి వాటిని కాళీ చేయించారు. క్యూలెక్స్ ఎనాపిల్స్ దోమల వల్ల మలేరియా డెంగ్యూ జ్వరాలు . సోకుతాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి , ఎంపీడీవో ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# సంపాదకీయం

## ప్రశ్నార్థకమవుతున్న ఈసీ విశ్వసనీయత

'భారతదేశంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చచ్చిపోయింది..' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో 1.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని తమ దర్యాప్తులో తేలిందని, ఈ విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా త్వరలో నిరూపిస్తామని ఆయన ప్రకటించారు. అనేక విషయాల్లో రాహుల్‌గాంధీ అడపాదడపా చేసే ఆరోపణలు సంచలనాత్మకంగా ఉంటున్నాయి. అవి, కొన్నిసార్లు న్యాయస్థానం విమర్శలకు గురైనప్పటికీ ఎన్నికల కమిషన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ఇదే సమయంలో బీహార్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న తీరుపై కొద్ది రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. ఎన్నికల కమిషన్ పనితీరుపై పార్లమెంట్‌లో చర్చించడం సంప్రదాయాలకు విరుద్ధమని, గతంలో బలరాం జాఖడ్ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ మేరకు రూలింగ్ ఇచ్చారని ఉభయ సభల అధిపతులు వాదిస్తున్నారు. అయినప్పటికీ బీహార్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్‌ను ప్రతిపక్షాలు అంత సులభంగా వదిలిపెట్టే అవకాశాలు కనిపించడం లేదు.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కేసుపై విచారణలో ఎస్ఐఆర్ జరుగుతున్న తీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఎన్నికల కమిషన్ ఓటర్ల పౌరసత్వంపై దృష్టి కేంద్రీకరించడం, కొత్త ఓటర్లను చేర్చుకోవడం కాకుండా ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవాలంటే ఒక వ్యక్తికి భారతీయ పౌరసత్వం ఉండాలని, కేవలం భారతీయ పౌరులనే ఓటర్లుగా చేర్చుకోవడం తమ బాధ్యత అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లుగా నమోదు కావాలంటే 11 డాక్యుమెంట్లు సమర్పించాలని, 1987 నుంచి 2004 మధ్య పుట్టినవారు తమ తల్లిదండ్రుల్లో ఒకరి డాక్యుమెంట్‌ను, 2004 తర్వాత పుట్టినవారు తల్లి, తండ్రి ఇరువురి డాక్యుమెంట్లనూ సమర్పించాలని చెబుతోంది. కేంద్రం జారీ చేసిన ఆధార్, తాము జారీ చేసిన ఎన్నికల గుర్తింపు కార్డులను కూడా ఈసీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.పౌరసత్వం ఆధారంగా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం పేరుతో ఎన్నికల కమిషన్ అధికార పార్టీని గెలిపించేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పౌరసత్వ సర్టిఫికెట్ జారీ చేయడం ఎన్నికల కమిషన్ పని కాదని, ఎన్నికలను పర్యవేక్షించే, నిర్వహించే రాజ్యాంగ బాధ్యత మాత్రమే కమిషన్‌కు ఉన్నదని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా కూడా వాదిస్తున్నారు. నిజానికి 2025లో ఓటర్ల జాబితా ప్రకటించేందుకు ముందే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేసి ఉంటే ఎన్నికల కమిషన్ ఇంత వివాదంలో ఇరుక్కునేది కాదు. బీహార్‌లో ఎన్నికలు సరిగ్గా రెండు మూడు నెలల్లో జరుగుతాయనగా ఆగమేఘాలపై కేవలం నెలలోపు ఈ సవరణ చేసేందుకు పూనుకోవడమే కమిషన్ నిజాయితీని శంకించేలా చేస్తోంది. ఒక రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ దేశంలో చాలా కాలంగా వివాదంలో ఉంటూనే వస్తోంది. 1990లో టీఎన్ శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిన తర్వాత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు తీసుకువచ్చారు. డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, గోడలపై రాతల్ని రాయడంతో పాటు ఎన్నికల ప్రసంగాల్లో మతాన్ని ఉపయోగించడాన్ని కట్టుదిట్టంగా అరికట్టారు. ఓటర్ల ఐడీ కార్డులను, ప్రవర్తనా నియామావళిని ప్రవేశపెట్టారు. ఎన్నికల ఖర్చులపై పరిమితిని విధించారు. ఎన్నికలకు ఎన్ని వాహనాలు ఉపయోగించారో కూడా అభ్యర్థులు లెక్క చెప్పాల్సి వచ్చేది. రిటర్నింగ్ అధికారులు ఈ వాహనాల మీటర్లను చెక్ చేసి ఎన్నికల ఖర్చులపై రోజువారీ లెక్కలతో సరిపోల్చేవారు. ఎన్నికల ముందు యూపీతో పాటు అనేక రాష్ట్రాల్లో 3లక్షల మందికి పైగా రౌడీషీటర్లని ముందస్తు అరెస్టులు చేయించిన శేషన్ ఒక దశలో ఓటర్లను ప్రలోభపెట్టినందుకు ఇద్దరు కేంద్రమంత్రులను తొలగించాల్సిందిగా ప్రధానమంత్రికే తాఖీదు పంపారు. శేషన్ హయాంలో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, ఎన్నికల సంబంధిత దాడులు, దొమ్మీలు, హత్యలు 90 శాతం పైగా తగ్గిపోయాయి. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న విషయంపై ఆయనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. 'ఇప్పటి వరకూ రాజకీయ నాయకులు చాలా చెత్తపనులన్నీ చేశారు. నేను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నంతకాలం ఎన్నికలు ఎలా నిర్వహించాలో నేనే నిర్ణయిస్తాను..' అని శేషన్ ప్రకటించారు. 'ఈ శేషన్ ఘటోత్కచుడిలా ఉన్నాడే..' అని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల వ్యవస్థకు విశ్వసనీయత సాధించినందుకు ఆయనకు రామన్ మెగసెసే అవార్డు లభించింది. కాని శేషన్ అనంతరం మళ్లీ పరిస్థితులు క్రమంగా మొదటికి రావడం ప్రారంభమైంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ నవీన్ చావ్లా వంటి అస్మదీయులను కమిషనర్లుగా నియమించారు. శేషన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, కట్టుదిట్టంగా అమలు చేసిన నిబంధనలన్నీ ఇప్పుడు నీరుకారినట్లు అనిపిస్తున్నాయి. అన్ని వ్యవస్థల మాదిరే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. డబ్బు, మద్యం, రెచ్చగొట్టే ఉపన్యాసాలతో పాటు అనేక అవలక్షణాలు ఎన్నో మళ్లీ ప్రవేశించాయి. అధికారంలో ఉన్న రాజకీయనాయకుల ఆగడాలపై శీతకన్ను వేసే పరిస్థితి స్పష్టంగా కనపడుతోంది.గత కొన్నేళ్లుగా ఎన్నికల కమిషన్‌పై రకరకాల ఆరోపణలు వస్తున్నాయి.

# రూ.500 దర్శనం రద్దు చేద్దామా?

ఉచిత, రూ.100, రూ.300 దర్శనాల్లో త్వరగా దుర్గమ్మ దర్శనం

' రూ.500 లైన్ మాత్రం గంటల తరబడి కదలని వైనం

' సహనం నశిస్తున్న భక్తులు.. అధికారులపై నినాదాలు

' ఈ ఉత్సవాల్లో ఆ పరిస్థితి లేకుండా చూడాలనే యోచనలు



ఆగస్టు 6 (సందేశం టైమ్స్)::మేము హైదరాబాద్ నుంచి వచ్చాం. రూ.500 టికెట్ తీసుకుంటే అమ్మవారి దర్శనం త్వరగా అవుతుందని చెప్పారు. ఇప్పటికే క్యూలోకి వచ్చి మూడు గంటలు అవుతుంది. మాకు దుర్గమ్మ దర్శనం కాలేదు. ఇతర క్యూల్లో వచ్చిన భక్తులు దర్శనం చేసుకుని వెళ్లిపోతున్నారు. గత శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రిపై భక్తులు వ్యక్తం చేసిన ఆగరహం ఇది.' 'ఈవో డౌన్ డౌన్ ..' అంటూ భక్తుల నినాదాలు, 2023 శరన్నవరాత్రుల్లో రూ.500 క్యూలో భక్తులు చేసిన నిరసన ఇది.' గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఏటా దసరా ఉత్సవాల్లో వస్తున్న ఇబ్బందులను గమనంలో పెట్టుకుని ఈసారి వేడుకల్లో రూ.500 టికెట్ దర్శనం రద్దు చేసే ఆలోచనలను అధికారులు చేస్తున్నారు. గత రెండు మూడేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లోరూ.500 దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్న యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. శరన్నవరాత్రుల్లో అంతరాలయం దర్శనం ఉండదు. కాబట్టి ఈ క్యూకు ఉత్సవాలు ముగిసే వరకు ఫుల్‌స్టాప్ పెడితే ఎలా ఉంటుందా.. అని ఆలోచన చేస్తున్నారు. దీనిపై మరింత కసరత్తు చేశాక తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.ఏటా శరన్నవరాత్రుల్లో ఐదు క్యూలైన్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో ఉచిత దర్శనం చేసుకునే భక్తుల కోసం రెండు క్యూలైన్లు ఉంటాయి. ఈ రెండూ వినాయకుడి ఆలయం నుంచి మొదలై ఘాట్ రోడ్డు మీదకు వస్తాయి. రూ. 100, 300, 500 క్యూలను ఏర్పాటు చేస్తారు. రూ.500 క్యూలైన్ ఓ మలుపు వద్ద నుంచి ప్రారంభమవుతుంది. ఈ టికెట్ కొన్న భక్తులు ఇక్కడి నుంచే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదే క్యూలైన్‌కు అనుబంధంగా మీడియా పాయింట్ సమీపాన మరో క్యూ ఉంటుంది.వాస్తవానికి రూ.500 టికెట్లు తీసుకున్నవారు, ప్రోటోకాల్ జాబితాలోని వ్యక్తుల సిఫార్సులతో వచ్చే వీఐపీలు ఓ మలుపు నుంచి దర్శనానికి వెళ్లాలి. రూ.500 టికెట్లు తీసుకున్న భక్తులు మాత్రమే అక్కడి నుంచి దర్శనానికి వెళ్తున్నారు. సిఫార్సు లేఖలతో వచ్చినవారు నేరుగా చినరాజగోపురం వద్దకు వచ్చి అక్కడ ఉన్న క్యూలోకి వెళు _న్నారు.. దీనివల్ల ఓ మలుపు వద్ద నుంచి క్యూలోకి వచ్చిన భక్తులు అమ్మవారి గోపురం వద్దకు చేరుకోవడానికి గంటల సమయం పడుతుంది. ఉచిత దర్శనం, రూ.300, రూ 300 క్యూల్లోని భక్తులకు దర్శనం వేగంగా జరుగుతోంది. దీంతో రూ.500 క్యూలో ఉన్న భక్తులు అసహనానికి గురవుతున్నారు.

# అనంతగిరి మండలం బజ్జగూడెం తండాలో పోలీస్ భరోసా కార్యక్రమం



సందేశం టైమ్స్ : అనంతగిరి బొజ్జగూడెం తండా గ్రామంలో ,అనంతగిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ, నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ,పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం. ఈ కార్యక్రమం నందు కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి హాజరై ,గ్రామప్రజలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి, పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలి అని, సమస్యలు సృష్టించవద్దు అని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో అనంతగిరి కానిస్టేబుల్స్ , పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నందు ప్రజలకు చట్టాల అమలు, జైలు శిక్షలు, వ్యక్తుల సత్ప్రవర్తన అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రజిత రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ప్రజా భరోసా కార్యక్రమాల సందర్భంగా, ఈరోజు బొజ్జగూడెం తండా గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని కల్పించడానికి వచ్చామని, ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని, క్షణికావేశంతో స్వార్థంతో, అత్యాశతో, ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని నేరాలకు పాల్పడవద్దని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గ్రామంలో నిఘా ఉంచాం అన్నారు. గ్రామం శాంతియుతంగా ఉంటే గ్రామ అభివృద్ధి జరుగుతుందని యువత భవిష్యత్తులో సన్మార్గంలో నడుస్తారని అన్నారు. సైబర్ మోసాలు రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించాలని మహిళల పట్ల దాడులకు పాల్పడకూడదని కోరారు. నేరాలకు పాల్పడం వల్ల జీవితం జైలు పాలవుతుందని, చట్టాలు బలోపేతంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# వ్యవసాయ రంగం అభివృద్ధికి



ఏర్పేడుఆగస్టు 6 (సందేశం టైమ్స్): మట్టిలోని జీవ కణాలు, కార్బన్ మీద దృష్టి తగ్గిపోతున్న క్రమంలో వ్యవసాయ రంగంతో కలిసి యువ శాస్త్రవేత్తలందరూ పనిచేయాలని గోదావరి బయో రిఫైనరీస్ లిమిటెడ్ ఛైర్మన్, సోమయ్య విద్యావిహార్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. తిరుపతి సమీపంలోని ఐసర్(భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ)లో జరిగిన ఆరవ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తాము రైతులతో కలిసి పనిచేస్తామన్నారు. పంచగవ్య, జీవామృతం వంటి సాంప్రదాయక విధానాలను పరిశీలించి, శాస్త్రీయంగా పరిశోధించి వాటిని ఆధునిక పద్ధతులతో మిళితం చేయడం ప్రారంభించామన్నారు.ఈ కృషి ఫలితంగా ఉత్తర కర్ణాటకలోని ఓ రైతు సగటున 30 టన్నులకు బదులుగా 120 టన్నుల చెరకు దిగుబడి సాధించారన్నారు. అంతకుముందు ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్ ఝిల్లు సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మార్పు కోసం మార్గనిర్దేశకులుగా మారాలన్నారు.వ్యవసాయం, సస్టైనబుల్ కెమిస్ట్రీ, సెమీకండక్టర్, ఎంజైమ్ తయారీ రంగాల్లో పరిశోధనలు చేయాలని ప్రోత్సహించారు.ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా రెండేళ్ల మాస్టర్ బై రీసెర్చ్(ఎంఎస్ -ఆర్) కోర్సును ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అంతకుముందు రిజిస్ట్రార్ ఇంద్రదీప్ సింగ్ కోహ్లీ ఆధ్వర్యంలో 2025కి గాను 225 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.

# కనీస వసతి, సరైన భోజనం కూడా కల్పించని వైనం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):: రొయ్యల చెరువుల్లో ఉపాధి కల్పిస్తామంటే వారంతా పొట్టచేత పట్టుకుని వచ్చారు. ఇలా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 40 మందిని పనిలో పెట్టుకున్న యజమానులు నెల రోజులుగా సరైన భోజనం కూడా పెట్టకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. దీంతో కూలీల్లో ఒకరు తప్పించుకుని వెళ్లి బస్తర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వెట్టి చాకిరీ



వ్యవహారం బయటికి వచ్చింది. వివరాలివీ.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం అనంతవరం లోని రెండు రొయ్యల చెరువుల యజమానులు నెల క్రితం మధ్యవర్తి ద్వారా ఒడిశా నుంచి 17 మంది, ఛత్తీస్‌గఢ్ నుంచి 23 మంది.. మొత్తం 40 మంది కార్మికులను ఇక్కడికి తీసుకువచ్చారు. చెరువుల వద్ద రోజంతా వారితో గొడ్డు చాకిరీ చేయించుకునేవారు. డబ్బులు ఇవ్వకపోవడమే కాదు.. సరైన భోజనం కూడా పెట్టేవారు కాదు. కనీస వసతి సైతం కల్పించలేదు. అరకొరగా బియ్యం మాత్రమే ఇవ్వడంతో దాంతో గంజి కాచుకుని అర్ధాకలితో అలమటించేవారు.

# ఏపీ నిట్‌కు నీరేది




తాడేపల్లిగూడెం అర్బన్,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ ఏర్పాటై 10 ఏళ్ల పూర్తి అయ్యింది. రోజూ 10 లక్షల లీటర్ల మంచినీరు అందిస్తామని అప్పట్లో ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఆ హామీ నెరవేరలేదు. భూగర్భ జలాలపైనే ఏపీ నిట్ విద్యార్థులు ఆధారపడుతున్నారు. గతంలో మంచి నీరు కొనుగోలు చేసే దుస్థితి నెలకొనడంతో.. రోజూ లక్ష లీటర్ల నీటిని మున్సిపాలిటీ నుంచి అందిస్తున్నారు. ప్రభుత్వ హామీ మేరకు మంచి నీరు సరఫరా చేయాలంటే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసారు. అప్పట్లోనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినా సుమారు రూ.3 కోట్ల బిల్లు పెండింగ్ పెట్టడంతో నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ప్రభుత్వం బిల్లు మంజూరు చేస్తేనే నిర్మాణం ముందుకు సాగుతుంది. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఇటీవల కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. బిల్లు మంజూరు చేస్తేనే పనులు ప్రారంభిస్తానని ఆయన స్పష్టంచేశారు. ఫలితంగా నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు ముందుకు సాగడం లేదు. అది పూర్తయితే అదనంగా రోజూ కోటి లీటర్ల మంచినీటిని శుద్ధి చేసి పట్టణ ప్రజలకు అందజేసే అవకాశం ఉంటుంది. అందులో నుంచి 10 లక్షల లీటర్ల నీటిని ఏపీ నిట్‌కు ఇవ్వాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

# అంబులెన్స్ ఢీకొని ఇద్దరు మృతి





ఉంగుటూరు,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): ప్రాణాలను రక్షించాల్సిన అంబులెన్స్ మృత్యు శకటమైంది. వ్యవసాయ పనులకు వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి తణుకు పట్టణానికి ఉదయం ఓ అంబులెన్సు రోగిని తీసుకువస్తోంది. మార్గమధ్యంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయ రహదారిపై, అదుపుతప్పిన అంబులెన్సు.. బైకుపై పొలం పనులకు వెళ్తున్న రైతు గున్న శ్రీరామ్మూర్తి(70), వ్యవసాయ కూలీ పెంద్ర చిరంజీవిని ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శ్రీరామ్మూర్తికి భార్య, కుమారుడు ఉన్నారు. చిరంజీవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# సీమలో వర్షాలు.. కోస్తాలో ఎండలు




విశాఖపట్నం, ఆగస్టు 6 (సందేశం టైమ్స్): రాయలసీమ, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. నైరుతి బంగాళాఖాతం నుంచి రాయలసీమ, కర్ణాటక మీదుగా అరేబియా వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో రాయలసీమలో ఎక్కువ చోట్ల, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. కోస్తాలో ఎక్కువ చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. కావలిలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో అనేక చోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 2–3 రోజులు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

# తిరుమలలో అన్నదానానికి మరో భోజనశాల



తిరుమల, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):తిరుమలలో తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రానికి అనుబంధంగా విశాలమైన మరొక భవనాన్ని నిర్మించాలని టీటీడీ భావిస్తోంది. ప్రస్తుతం ఒకేసారి 4 వేల మంది భోజనం చేసేలా నాలుగు డైనింగ్ హాళ్లు అన్నప్రసాద కేంద్రంలో ఉన్నాయి. రోజుకు 70 నుంచి 75 వేల మంది ఇక్కడ భోజనం చేస్తుంటారు. రద్దీ రోజుల్లో ఈ సంఖ్య లక్ష దాటుతుంది. ఇటువంటి సమయాల్లో ఈ కేంద్రం వద్ద భారీగా క్యూ లైన్లు ఉంటున్నాయి. దీంతో వెయ్యి మంది ఒకేసారి భోజనం చేసేలా మరొక హాలు అవసరమని టీటీడీ అధికారులు అంచనా వేశారు. వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రానికి సమీపంలోని గ్యాస్ ప్లాంట్‌ను గోగర్భం డ్యాం వద్దకు తరలిస్తున్నందున, ఈ ప్రదేశంలో కొత్త భవనం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిసింది. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అన్నప్రసాద విభాగం అధికారులతో కలిసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు.

# ప్రముఖ కథా రచయిత కోడూరి శ్రీరామమూర్తి అస్తమయం



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్): ప్రముఖ కథా రచయిత, సాహిత్య విమర్శకుడు కోడూరి శ్రీరామమూర్తి రాత్రి రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలో ఆయన స్వగృహంలో కన్నుమూశారు. శ్రీరామమూర్తి లిటరరీ కాలమిస్టుగా, సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషిస్తూ దినపత్రికల్లో వ్యాసాలు రాసే ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, వేలాది సాహితీ విమర్శనా వ్యాసాలు రాసిన సాహితీ విమర్శకుడిగా పలువురి మన్ననలను పొందారు. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ పుస్తకం 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథంగా పురస్కారం పొందింది. తెలుగు కథ... నాడు-నేడు పుస్తకం 2007లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ సాహిత్య విమర్శనా గ్రంథంగా పురస్కారం పొందింది. కాగా ఇటీవల ఆయన రాసిన 'రచయితగా మహాత్ముడు', 'మహాత్ముని అడుగుజాడలు' పుస్తకాలను ప్రముఖ వైద్యుడు, అభ్యుదయవాది డాక్టర్ చెలికాని స్టాలిన్ ఈ ఏడాది ఏప్రిల్ 28న ఆవిష్కరించారు

# ఈడీ పోలీసులమంటూ.. దారి దోపిడీ

**కారును అడ్డగించిన కేటుగాళ్లు**
**బెదిరించి రూ.70 లక్షలున్న బ్యాగ్‌తో పరార్**
**స్నేహితుడి వద్ద బంగారం కొనుగోలుకు నగదు తెచ్చుకున్న బాధితుడు**
**దోపిడీ జరిగాక ఆ స్నేహితుడికి ఫోన్ చేసినా లేని స్పందన**
**గుంటూరు జిల్లా మేడికొండూరులో ఘటన**




మేడికొండూరు,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): దోపిడీలకు పాల్పడడంలో కేటుగాళ్లు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఈడీ పోలీసులమంటూ బెదిరించి.. ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.70 లక్షలు దోచుకెళ్లారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు సమీపంలో అర్ధరాత్రి జరిగింది. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాకు చెందిన మాణిక్ జగదీశ్, రంజిత్ మారుతి పటేల్ అనే ఇద్దరు రాజమహేంద్రవరంలోని నగలు తయారీ దుకాణాలలో కొంతకాలం పనిచేశారు. ప్రస్తుతం జగదీష్ విజయవాడలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రంజిత్ తన వద్ద రెండు కేజీల మడి బంగారం ఉందని, దానిని కేజీ రూ.58 లక్షలకు విక్రయిస్తానంటూ జగదీశ్‌కు తెలిపాడు. ఆ ముడి బంగారం కొనేందుకు డబ్బుతో సత్తెనపల్లి రావాలని జగదీశ్‌ను రంజిత్ కోరాడు. జగదీష్ తన వద్ద ఉన్న రూ.70 లక్షలతో కారులో సత్తెనపల్లికి వచ్చి.. ఆ డబ్బును రంజిత్‌కు చూపించాడు. రంజిత్ వద్ద ఉన్న ముడి బంగారాన్ని జగదీశ్ చూసి నిర్ధారించుకున్నాడు. అయితే బంగారం తూకం కోసం ఇద్దరూ మాట్లాడుకుని విజయవాడలో తూకం వేయడానికి బయలుదేరారు. వీరి రెండు కార్లు ఒకదాని వెంట ఒకటి వస్తున్న క్రమంలో.. వెంబడిస్తూ ఫార్చ్యూనర్ కారులో వచ్చిన ఆరుగురు వ్యక్తులు మేడికొండూరు సమీపంలోని ఈద్గా వద్ద జగదీష్ కారును అడ్డగించారు. తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పోలీసులమని, మీ కారుని తనిఖీ చేయాలని చెప్పారు. వారిలో ఇద్దరు పోలీసు దుస్తులు ధరించి ఉండటంతో నిజంగానే పోలీసులని భావించిన జగదీష్ తన కారు డోర్ తెరిచాడు. కారులో ఉన్న డబ్బుల బ్యాగును తీసుకొని రేపు ఈడీ ఆఫీసకి వచ్చి ఫిర్యాదు చేయాలని వెళ్లిపోయారు. ముడి బంగారం ఉన్న రంజిత్‌ను తమతో రావాలని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం రంజిత్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో వచ్చింది దొంగలేనని, పథకం ప్రకారం డబ్బు దోచుకుపోయారని భావించిన జగదీశ్ మేడికొండూరు పోలీసులను ఆశ్రయించాడు.

# నిర్వాసితుల రేషన్ కష్టం

**వీఆర్ పురం నుంచి వాహనంలో తెచ్చిన రేషన్ బియ్యాన్ని దించుకుంటున్న నిర్వాసితులు(ఫైల్)**
**రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే 300 కిలో మీటర్లు వెళ్లాలి**
**రూ.30 వేల ఖర్చు తప్పదు**
**బుట్టాయగూడెం పునరావాస కాలనీలో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా నిర్వాసితులు**
**రెండేళ్లుగా రేషన్ కార్డులు మార్చలేదు!**



ఆగస్టు 6 (సందేశం టైమ్స్):బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం పునరావాస కాలనీలో ఉంటున్న నిర్వాసితులకు రేషన్ సరుకులు 300 కిలో మీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాలి. రెండు వాహనాలకు సుమారు రూ.30 వేలు చెల్లించాలి. మన్యం జిల్లా పోచవరం నిర్వాసితులను ఇక్కడికి తరలించారు. వారి రేషన్ కార్డులు ఇక్కడి బదిలీ కాలేదు. రేషన్ సరుకులు అలాట్‌మెంట్ లేదు. ప్రతి నెల 300 కిలో మీటర్ల దూరం నుంచి రేషన్ తెచ్చుకోవాలిసిందే. రెండేళ్లుగా రేషన్ కార్డు సమస్యపై ఎంతమంది అధికారులకు విన్నవించినా పట్టించుకున్న వారే లేరు.బుట్టాయగూడెం, రేషన్ కష్టాలను ఎప్పటికి తీరుస్తారని రామన్నగూడెం (పోచవరం) ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన నిర్వాసితులు అడుగుతున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ తెచ్చుకోవాలంటే సుమారు 300 కిలో మీటర్లు వెళ్లాలని, రూ.30 వేలు ఖర్చు చేయాలని గగ్గోలు పెడుతున్నారు. తమ కష్టాలను ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కాలనీ నిర్వాసితులకు పిలుపు రాలేదు.

# వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం



ముదినేపల్లి,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీఎస్ కిశోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. పామర్రు దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భద్రతా చర్యల లోపంతో ఇటీవల ముదినేపల్లి సమీపంలో పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ లోకి కారు దూసుకుపోయి రిటైర్డ్ సైంటిస్ట్ మృతి చెందారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఎస్పీ, జేసీ పరి శీలించారు. రెండో వంతెన నిర్మాణ ప్రదేశానికి రెండు వైపులా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటే ప్రమాదం జరిగేది కాద న్నారు. ఇకపై ఎటువంటి ప్రమాదం జరిగినా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోల్ రాజ్ డ్రెయిన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవా లని నేషనల్ హైవే ఎస్ఈ, డీఈఈలను ఆదేశించారు. రెవె న్యూ, పోలీస్ అధికారులు కూడా పనులను పరిశీలించాల న్నా రు. అనంతరం పెదపాలపర్రు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. రహదారి పనులతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని ముదినేపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

# తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కుదుపులు

## తణుకు జిల్లా ఆసుపత్రిలో మూలనపడ్డ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు
## 14 వాహనాలకు పనిచేసేవి తొమ్మిదే
## మరమ్మతులు లేక మూలనపడ్డ ఐదు
## నాలుగు నెలలుగా జీతాల పెండింగ్



తణుకు,ఆగస్టు 6 (సందేశం టైమ్స్):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు మరమ్మతులతో మూలనపడ్డాయి. మరమ్మతులకు గురైతే ఈ వాహనాన్ని పట్టించుకునే వారే లేరు. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు అందడం లేదు. ప్రభుత్వాసుపత్రిలో గర్భవతి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లీ బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చాలనే బృహత్తర లక్ష్యంతో దీనిని ప్రవేశపెట్టారు. రాను రాను ఈ పథకం నిర్వహణలో చాలా ఇబ్బందులు ఎదురవుతు న్నప్పటికి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వాహనాలకు టైర్లు అరిగిపో వడం, ఇంజన్ మరమ్మతులకు రావడం వంటి సమస్యలకు పరిష్కా రం చూపించడం లేదు. దీంతో ఆయా వాహనాలు మూలనపడ్డా యి. ఈ కారణంగా అవి భవిష్యత్‌లో మరింత పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 14 వాహనాలు వున్నాయి. తణుకులో ఆరింటికి మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన మూడింటికి టైర్లు అరిగిపోయి పక్కన పెట్టేశారు. తాడేపల్లిగూడెంలో రెండింటికి ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మరొ కటి మరమ్మతులకు గురైంది. పెనుగొండలో ఒకటి, ఆచంటలో మరొకటి ఉన్నాయి. ఆచంట వాహనానికి డ్రైవర్ రెండేళ్ల క్రితం చనిపో యినప్పటికి ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.

# ఆ ముగ్గురు మంచి స్నేహితులు. ముగ్గురూ డిప్లొమ చదువుతున్నారు.







వజ్రపుకొత్తూరు/టెక్కలిఆగస్టు 6 (సందేశం టైమ్స్):: ఆ ముగ్గురు మంచి స్నేహితులు. ముగ్గురూ డిప్లొమ చదువుతున్నారు. సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లారు. కొద్దిసేపు తరువాత స్నానం కోసం సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి వారు గల్లంతయ్యారు. ఈ ఘటన సాయంత్రం బావనపాడు తీరంలో చోటు చేసుకుంది. వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి పంచాయతీ మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన (18), పూడిజగ న్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండల టెక్కలిప ట్నంకు చెందిన రాయల రాజేష్(19) విజయనగరం జిల్లా గజపతినగరంలోని ఓ కళాశాలలో డిప్లొమ చదువుతున్నారు. ఈ ముగ్గురూ స్నేహితులు. సాయంత్రం బావనపాడు తీరానికి వెళ్లారు. అక్కడ కొంత సమయం ఆనందంగా గడి పిన తరువాత సముద్ర స్నానానికి దిగారు. అలల ఉధృతికి ముగ్గురూ కొట్టుకుపో యారు. అటుగా వస్తున్న మత్స్యకారులు యువకుల గల్లంతును గుర్తించి స్థానికులకు, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సీఐ డి.రాము నేతృత్వంలో మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. వీరివి నిరుపేద కుటుంబాలు. మడేవానిపేటకు చెందిన దున్న మాధవరావు సీతమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు దుర్యోధన కాగా, రెండో కుమారుడు స్థానిక హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో దుర్యోధన గల్లంతు వార్తతో ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల వల్లభరావు, సుధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జశ్వంత్ ఉ న్నాడు. జశ్వంత్ సముద్రంలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. టెక్కలిపట్నం చెందిన రాయల రాజేష్‌ది కూడా పేద కుటుంబమే. రాజేష్‌ను తల్లి జ్యోతి అల్లారుముద్దుగా పెంచింది. కుమారుడు సముద్రంలో గల్లంతయ్యాడని తెలిసి విలపిస్తుంది.

# చెన్నైలో ఇసుకలపాలెం మత్స్యకారుడు మృతి




సోంపేట రూరల్,ఆగస్టు 6 (సందేశం టైమ్స్):ఇసుకలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు నీలకంఠం (32) చెన్నై కాశినీడు ప్రాంతంలో మృతి చెందినట్టు ఆ గ్రామ పెద్ద బైపల్లి ఈశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యులు, ఆయన తెలిపిన వివరాల మేరకు.. నీలకంఠం చెన్నైకు వలసవెళ్లి చేపల వేట సాగిస్తూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. గత ఏప్రిల్‌లో గ్రామానికి వచ్చి మళ్లీ చెన్నై వెళ్లాడు. రెండు రోజుల కిందట పది మంది మత్స్యకారులతో కలిసి సముద్రంలో వేట సాగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారిపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న ఆయన్ని తోటి మత్స్యకారులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీలకం ఠానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకురాలేక అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఇంటిపెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

# కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి




పెద్దదోర్నాల ఆగస్టు 6 (సందేశం టైమ్స్)::మద్యం మత్తులో గొడవ చేస్తున్న తండ్రిని మందలించిన కుమారుడిపై గొడ్డలి, విల్లంబులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండలంలోని పోతన్న గూడెంలో రాత్రి జరిగింది. ఈ ఘటనలో కుడుముల బయన్నకు తలపై గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతన్నగూడేనికి చెందిన కుడుముల వెంకటేశం మద్యం సేవించి భార్యపై చేయిచేసుకుంటుండగా కుమారుడు బయన్న అడ్డుకున్నాడు. దీంతో ఆవేశంతో వెంకటేశం గొడ్డలితో కుమారుడి తలపై దాడి చేసి, అనంతరం విల్లంబుతో కూడా గాయపరిచి పరారయ్యాడు. గమనించిన బంధువులు క్షతగాత్రున్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కరిగిన మేఘం



అనంతపురం అర్బన/ క్లాక్‌టవర్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్): జిల్లా వ్యాప్తంగా రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా బెళుగుప్పలో 90.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. డి.హీరేహాళ్ 58.2, నార్పల 46.2, రాయదుర్గం 45.6, యల్లనూరు 39.2, కళ్యాణదుర్గం 32.2, ఉరవకొండ 30.2, యాడికి 28.4, కణేకల్లు 22.2. వజ్రకరూరు 22.4, పెద్దపప్పూరు, కుందుర్పి 20.6, విడపనకల్లు 16.2, బ్రహ్మసముద్రం 15.4, గుంతకల్లు 15.2, తాడిపత్రి 13.4, శెట్టూరు 12.6, కంబదూరు 12.4, బొమ్మనహాళ్ 11.8, గార్లదిన్నె 10.6, గుమ్మఘట్ట 10.2, బుక్కరాయసముద్రం, అనంతపురం 9.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 7.2 మిల్లీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది. అనంతపురం, నార్పల, గుమ్మఘట్ట, బెళుగుప్ప మండలాల్లో ఓమోస్తరు వర్షం పడింది. డి. హీరేహాల్, పుట్లూరు, గుత్తి, కూడేరు, ఉరవకొండ, గార్లదిన్నె, విడపనకల్లు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

# తమ్ముడి పెళ్లికని అమెరికా నుంచి వస్తూ..!



చంద్రగిరిఆగస్టు 6 (సందేశం టైమ్స్):తమ్ముడి వివాహం. చాలా కాలం తర్వాత సొంతగడ్డకు వస్తున్నామన్న ఆనందం. కుటుంబ సభ్యులు.. బంధుమిత్రులతో సరదాగా గడపొచ్చని భావించారు. అమెరికా నుంచి భర్తతో కలిసి ఇండియా వచ్చారు. మరో అరగంటలో ఇల్లు చేరతామనగా, కుక్క రూపంలో మృత్యువు తరుముకొచ్చింది. కుక్క అడ్డ రావడంతో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో లేమ(34), డ్రైవరు రాజేష్ దుర్మరణం చెందారు. ఆమె భర్త కార్తిక్ గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద ఘటన చంద్రగిరి మండలం మామండూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి కరంబాడి రోడ్డులోని కేఆర్ నగర్‌కు చెందిన కార్తిక్, లేమ దంపతులు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ఈనెల 13న లేమ తమ్ముడి వివాహం ఉంది. దీనికోసం వీరు అమెరికా నుంచి బయలుదేరి.. సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అద్దె కారులో తిరుపతికి బయలుదేరారు. వేకువజామునకు మామండూరు వద్ద జాతీయ రహదారిలో వస్తున్న వీరి కారుకు ఓ కుక్క అడ్డంగా వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొంది. బెంగళూరుకు చెందిన కారు డ్రైవర్ రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బెలూన్ ఓపెన్ అయినా అతడి ప్రాణాలు దక్కలేదు. తీవ్ర గాయాలైన కార్తిక్, లేమను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే లేమ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్తిక్ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సందడిగా ఉండాల్సిన పెళ్లింట.. విషాదం నెలకొంది.

# గజదాడులనుంచి ఉపశమనం దొరికేనా?



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):మదపుటేనుగులను అదుపులోకి తెచ్చేందుకు అటవీ శాఖ పలమనేరు ప్రాంతంలో చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఇటు అటవీశాఖ అధికారుల్లో, అటు పంటలు, ప్రాణాలు నష్టపోతున్న రైతుల్లో ఉ పశమనం కనబడుతోంది.'ఆపరేషన్ కుంకీ' ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తోపాటు అటవీశాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అటవీ శాఖాధికారులకు అభినందనలు వచ్చాయి.మే 21వ తేదీన కర్ణాటక నుంచి వచ్చిన నాలుగు కుంకీ ఏనుగులు పలమనేరు చేరాయి. ఇక్కడి వాతావరణానికి అవి అలవాటు పడటానికి నెల రోజులు పట్టింది.కుంకీలతో వచ్చిన కర్ణాటక మావటీలు ఏనుగులతోపాటు ఇక్కడి మావటీలకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఏనుగుల డ్రైవ్‌పై జిల్లా అటవీశాఖలో పనిచేస్తున్న 40మంది బెంగళూరులోని దుబేరా ఎలిఫెంట్ బేస్ క్యాంపులో శిక్షణ పొందారు. వీరిలో 17 మంది ఏనుగుల డ్రైవ్‌లో నైపుణ్యం సాధించారు. దీంతో కర్ణాటక మావటీలు వెళ్లిన తర్వాత శిక్షణ పొందిన 17 మంది మావటీలు కుంకీలకు శిక్షణ మొదలు పెట్టారు. నాలుగు కుంకీలను వారి ఆధీనంలోకి తెచ్చుకోడానికి మరో 40 రోజుల సమయం పట్టింది.కుంకీలకు, మావటీలకు మధ్య సమన్వయం కుదరడంతో ట్రయల్ రన్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. డీఎఫ్‌వో భరణి సూచనలతో ఆగస్టు 1న కుంకీలకు పరీక్షలు నిర్వహించారు. వాటి శారీరక ధృడత్వం వంటివి పరిశీలించాక మూడు ఏనుగులు మాత్రమే ఫిట్ కావడంతో వాటితోనే శనివారం ట్రయల్‌రన్ ఆపరేషన్ చేపట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టేకుమంద ప్రాంతంలో తిరుగుతున్న 8 ఏనుగులపై కుంకీలైన కృష్ణ, జయంత్, వినాయక్‌లను ప్రయోగించారు. ముగ్గురు మావటీలు కుంకీలను అటువైపు తీసుకుపోయి, అటవీ ప్రాంతంలోని ఏనుగులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవడంతోపాటు అటవీ ప్రాంతంలోకి మళ్లించగలిగారు.

# కంటైనర్‌ను ఢీకొన్న కారు



తవణంపల్లె, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):ఆగి ఉన్న కంటైనర్‌ను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని ఎలాక్ట్రానిక్ సిటీకి చెందిన శ్రీకాంత్(34) తన తల్లి లక్ష్మీదేవి(55), కుమారుడు శ్రీయాన్(3)తో కలిసి తిరుమలేశు డిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపాన ఉన్న నయారా పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని శ్రీకాంత్, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ శ్రీయాన్ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# ట్యాంకర్‌ను మింగిన రోడ్డు!



**బంజారాహిల్స్‌లో కూలిన 30 ఏళ్ల కిందటి నాలా శ్లాబ్**
**అందులో పడిపోయిన 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకర్**
**ట్యాంకర్ డ్రైవర్‌ను, క్లీనర్‌ను బయటకు తీసిన స్థానికులు**

పంజాగుట్ట, ఆగస్టు 6 (సందేశం టైమ్స్): ఐదు టన్నుల బరువు.. పదివేల లీటర్ల నీటి లోడుతో వెళ్తున్న.. భారీ వాటర్ ట్యాంకర్‌ని రోడ్డు మింగేసింది! అయితే, అది పైకి రోడ్డులా కనిపించినా.. రోడ్డు కాదు! ఆ ప్రాంతంలో ఉన్న బంజారా చెరువు నుంచి నీరు హుస్సేన్‌సాగర్‌లోకి పోవడానికి ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన నాలా శ్లాబ్!! ఇన్నేళ్లుగా వానలకు తడిసి.. ఎండలకు ఎండిన ఆ నాలా శ్లాబ్.. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మరింత నాని పూర్తిగా బలహీనమైపోయింది! దుర్బలమైన ఆ శ్లాబ్‌పైకి అంత బరువైన నీళ్ల ట్యాంకర్ రావడంతో తట్టుకోలేక కుంగిపోయింది. దీంతో ట్యాంకర్ అందులో పడిపోయింది. తెల్లవారుజామున జరిగిందీ ఘటన. ట్యాంకర్ ఎడమ భాగం నాలాలోకి కూరుకుపోవడంతో క్లీనర్ అందులో ఇరుక్కుపోయాడు. పెద్ద శబ్దంతో లారీ అందులో పడిపోవడంతో ఉలిక్కిపడి లేచిన స్థానికులు అక్కడికి చేరుకుని.. కష్టపడి అతణ్ని బయటికి తీశారు. వారికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తీసుకున్న జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, ఖైరతాబాద్ పోలీసులు, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. (4వ తేదీ) కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి నుంచి వర్షం నీరు ఈ రోడ్డులోకి పోటెత్తడంతో.. స్థానికులు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడానికి రోడ్డు మొదట్లో బ్యారికేడ్లు కూడా ఏర్పాటు చేశారు.

# నేడు, రేపు భారీ వర్షాలు



హైదరాబాద్,ఆగస్టు 6 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, జనగాం, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం మధ్య రాష్ట్రంలో ఏడు మండలాల్లో 6-10 సెం.మీ. మధ్య వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. మరో 78 మండలాల్లో 2-6 సెం.మీ. మధ్య వర్షపాతం రికార్డు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

# బచ్చన్నపేటలో జనవాసాల మధ్య స్క్రాప్ దుకాణాలు.. పట్టించుకోని అధికారులు



బచ్చన్నపేట ఆగస్టు 6 (సందేశం టైమ్స్):జనవాసాలకు దూరంగా ఉండాల్సిన స్క్రాప్ దుకాణాలు జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోనే రహదారుల వెంట, జనవాసాల మధ్య అనూహ్యంగా పెరుగుతున్నాయి. లక్షలు కురుపించే వ్యాపారం కావడంతో చాలా మంది దృష్టి ఈ వ్యాపారంపైకి మళ్లింది. ఫైర్ సేఫ్టీ, గ్రామపంచాయతీల అనుమతి లేకుండానే నిబంధనలు పట్టకుండా వ్యాపారం సాగుతోంది. వీటికి పన్ను కట్టక్కర్లేదు. జీఎస్టీ చెల్లింపులు పన్ను అక్కర్లేదని, పుట్టగొడుగుల్లా స్క్రాప్ దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. తొలుత జీవనోపాధికి పెట్టుకున్న ఈ షాపులు క్రమేపీ వ్యాపార సామ్రాజ్యంగా విస్తరిస్తున్నాయి.%సాధారణంగా స్థానిక గ్రామ పంచాయతీ అనుమతితోనే స్క్రాప్ దుకాణాలు ఏర్పాటుచేయాలి. జిల్లా నుండి ఫైర్ స్టేషన్ అనుమతి ఉండాలి. మండలంలో ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఇది జరగడం లేదు. స్క్రాప్ కొనుగోలు, విక్రయాలు బిల్లు చెల్లింపుల ద్వారా జరగాలి. కానీ లారీలకు లారీలు లోడ్లతో స్క్రాప్ తరలుతున్నా ఎటువంటి పన్నులు చెల్లించడం లేదన్న ఆరోపణలున్నాయి. తప్పుడు వే బిల్లుతో తరలిస్తున్నట్టు సమాచారం. స్క్రాప్ దుకాణాల వల్లే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

# బోరు మోటార్ల దొంగలు అరెస్టు



%కట్టంగూర్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, బ్యాటరీల దొంతనాలకు పాల్పడుతున్న నిందితులను కట్టంగూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ ఏఎస్పీ జి.రమేశ్ మంగళవారం కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ మునుగోటి రవీందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాల వెల్లడించారు. నకిరేకల్ పట్టణానికి చెందిన ఎడ్ల సురేశ్, నాగిళ్ల ముత్తయ్య, గోపగాని రమేశ్, అవుల రాజాలు, నాగిళ్ల యల్లయ్య కట్టంగూర్ మండలం ఈదులూరులో గల డెయిరీ ఫామ్, అయిటిపాముల ఎస్ఎల్‌బీసీ కెనాల్‌తో పాటు శాలిగౌరారం మండలంలోని వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, జోరు పైపులు, బ్యాటరీలు, ఇతర వస్తువులను అపరించుకుపోయారు. దొంగిలించిన సామగ్రిని విక్రయించేందుకు ట్రాలీ ఆటోలో నకిరేకల్ నుండి హైదరాబాద్‌కు బయల్దేరారు. పక్కా సమాచారంతో ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో వాహనాన్ని తనిఖీ చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి 14 మోటార్లు, 33 జోరు వైపులు, 5 బ్యాటరీలు, ట్రాలీ ఆటో, రాగి వైర్లు, రెండు ప్యాన్లు రూ.1.74 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.13.61 లక్షలు ఉంటుందని తెలిపారు. దొంగలను పట్టుకున్న సీఐ కొండల్ రెడ్డి, ఎస్ ఐ రవీందర్, కానిస్టేబుల్ బండి గిరి. శంకర్, గంట శంకర్, మునాస సత్యనారాయణను ఏఎస్పీ రమేశ్, డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

# మణుగూరు సింగరేణి బంగ్లోస్ క్వార్టర్స్‌లో అరుదైన సర్పం పట్టివేత




రామవరం, ఆగస్టు 6 (సందేశం టైమ్స్):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి బంగ్లోస్ క్వార్టర్స్ లో అరుదైన సర్పం కనిపించింది. రాత్రి 11 గంటలకు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి పాము కనిపించగానే ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యుడు ముజఫర్‌కు సమాచారం అందించారు. వెంటనే అతడు వెళ్లి పామును పట్టుకున్నాడు. గతంలో ఎన్నడూ చూడని పాము కావడంతో ఫొటో తీసి ప్రాణదార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోశ్‌కు తెలిపాడు. గమనించిన సంతోశ్ అది విషపూరితమైన కట్లపాము జాతికి చెందిన బాండెడ్ క్రైట్ స్నేక్ అని తెలిపారు.%హిమోటాక్సిన్ విషం కలిగినదని, ఈ సర్పం గుండ్రంగా కాకుండా మూడు పలకలుగా ఉండి సమాన వెడల్పు గల పసుపు, నలుపు చారలతో ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో ఉంటుందని, రాత్రిళ్లు మాత్రమే సంచరిస్తుందని తెలిపారు. గతంలో ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ ఆవరణలోకి రెండు సార్లు వచ్చినట్లు పోలీస్ సిబ్బంది తెలిపారన్నారు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ అరుదైన సర్పం కనిపించడం ఇదే తొలిసారి అని సంతోశ్ వెల్లడించారు.

# 7న కోటమైసమ్మ తల్లి జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి వేలం



కారేపల్లి, ఆగస్టు 6 (సందేశం టైమ్స్): దసరా పండుగ సందర్భంగా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి అలయ ప్రాంగణంలో నిర్వహించే జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి ఈనెల 7న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈఓ కొండకింది వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 6వ వరకు 11 రోజులు పాటు జరిగే జాతరలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకాలకు గత నెల 17, 28 తేదీల్లో వేలం పాటలు నిర్వహించగా పాటదారులు ముందుకు రాలేదన్నారు. దీంతో కొబ్బరికాయల వేలం వాయిదా పడింది. దీనికి సంబంధించి ఈ నెల 7న వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# నిఘా నేత్రాలు నిద్రపాయే.. దొంగల ఆచూకీ దొరకకపాయే




ఆగస్టు 6 (సందేశం టైమ్స్): నిర్లక్షం దొంగలకు వరంగా మారింది. బాధితులు మాత్రం లబోదిబోమని ఏడ్చే పరిస్థితి దాపురించింది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ప్రాంతాల్లో పరిస్థితి. అప్పటి సీఐ బత్తుల సత్యనారాయణ ప్రజల భాగస్వామ్యంతో సుమారు రూ.12 లక్షల వ్యయంతో టూటౌన్ పరిధిలోని రామవరం, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, ధన్బాద్, రుద్రంపూర్, గౌతమ్ పూర్, పెనగడప, రాంపురం పంచాయతీలో 64 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ అవి క్రమంగా పని చేయకుండాపోయి కేవలం అలంకారప్రాయంగా మాత్రమే మిగిలిపోయాయి.%ఈ ప్రాంతాల్లో ఏమైనా అనుకోని సంఘటనలు జరిగితే నిందితులను తొందరగా గుర్తించి కేసును ఛేదించవచ్చనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అధికారుల నిర్లక్షంతో పని చేయకుండా పోయాయి. రుద్రంపూర్‌లో పట్టపగలే ఓ ఇంట్లో భారీ చోరీ జరిగినా నిందితుడి ఆచూకీ లభించలేదు. అదే సీసీ కెమెరాలు పని చేసి ఉంటే నిందితుడి గుర్తించడంలోనూ. అలాగే దొంగతనం చేసేందుకు భయపడేవారని ఇక్కడి ప్రజలు అభిప్రాయపడ్డారు. గతంలోనూ ఈ ప్రాంతంలో దొంగతనాలు జరిగినా అధికారుల్లో స్పందన కరువైందన్నారు.

# విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



భీమినిఆగస్టు 6 (సందేశం టైమ్స్):అధికారులు, సిబ్బంది విధులను నిర్ల క్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. భీమిని మండలంలో పర్యటించా రు. మల్లీడిలోని నర్సరీని పరిశీలించారు. ఇంకా ఎందుకు మొక్కలు నాటలేదని మల్లీడి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వహించడం ఇష్టం లేకపోతే మానేయాలని హెచ్చరించారు. ఆపై ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన పులగం శ్రీలత, పులగం సాలక్క ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రావడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. మిగితా వారందరికీ వచ్చాయని, తమకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు%వంట గదిలో కూరగాయలు నిల్వ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన కూరగాయలతో వంట చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బందిని ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# క్రీడావార్తలు



## భారత్ సిరీస్ రుచి చూపించింది.

## ఐదు టెస్టుల్లో ఇరుజట్ల

అసలు సిసలు టెస్టు క్రికెట్ మజాను ఇంగ్లండ్–భారత్ సిరీస్ రుచి చూపించింది. ఐదు టెస్టుల్లో ఇరుజట్ల ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. ఇంగ్లండ్‌లో టెస్టులు అంటే ప్రతి అభిమానికి గుర్తుకు వచ్చేది ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్. కానీ, భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్ అంతకుమించి అనే విధంగా ఫ్యాన్స్‌ను ఆకట్టుకొంది. నాటకీయ పరిణామాల మధ్య 25 రోజులపాటు సాగిన సిరీస్.. టెస్టుల స్థాయిని అమాతంగా పెంచేసింది. ఈ ఇండో–ఇంగ్లండ్ సిరీస్ సరికొత్త శత్రుత్వానికి బీజం వేసింది. ఈ ఆరోగ్యకరమైన పోరు భవిష్యత్‌లో యాషెసను మించి ఎదగవచ్చన్నది విశ్లేషకుల అంచనా. సుదీర్ఘమైన షెడ్యూల్‌లో ఇరుజట్లూ కొదమసింహాల్లా తలపడ్డాయి. ప్రతి టెస్టూ ఐదోరోజు వరకూ సాగడం ఈ మధ్యకాలంలో అద్భుతమనే చెప్పుకోవాలి. సంధి దశలో ఉన్న టీమిండియా..యువ కెప్టెన్ గిల్ నాయకత్వంలో ఆతిథ్య ఇంగ్లండ్‌కు కనీసపోటీ ఇస్తే గొప్పే అని సిరీస్ ఆరంభానికి ముందు భావించారు. కానీ, యువ భారత్ పోరాటంతో ఇంగ్లండ్ బిత్తరపోయింది. బుమ్రా దూరమైన రెండు




టెస్టుల్లోనూ గిల్‌సేన నెగ్గడం గమనార్హం. ముఖ్యంగా భారత్ సమష్టిగా ఆడడం ఈ సిరీస్ ప్రత్యేకతగా భావించాలి. ఆఖరి టెస్టు వేదిక ఓవల్‌లో మ్యాచ్ ముగింపు చిరకాలం గుర్తుండిపోతుంది. గెలుపు దోబూచులాడుతున్న తరుణంలో.. తీవ్ర ఒత్తిడి మధ్య భారత్ అపూర్వ విజయంతో అభిమానుల హృదయం పులకరించింది. సిరీస్ సాగిన తీరును యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనించింది. ఫ్రాంచైజీ లీగుల జోరులో వైభవం కోల్పోతున్న టెస్టు క్రికెట్‌కు ఈ సిరీస్ సరికొత్త ఊపిరిలూదింది. ఇండో–ఇంగ్లండ్ సిరీసలో గెలుపెవరిదో తేలలేదు.. కానీ విజయం సాధించింది మాత్రం క్రికెట్ మాతృక టెస్టు ఫార్మాటే!ఇంగ్లండ్‌తో సిరీస్ డ్రాగా ముగిసినా.. ఇరుజట్లు చేసిన పోరాటం అసాధారణం. మా ఈ ప్రదర్శన భారత టెస్టు క్రికెట్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. టెస్టు క్రికెట్ మజా ఏంటన్నది ఈ సిరీస్ రుచి చూపించింది. ఇకనుంచి ఎవరు కూడా టెస్టు మ్యాచ్‌లు బోర్ అని అనరన్న నమ్మకముంది. సంప్రదాయ ఫార్మాట్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్.ఇప్పుడు కూడా 4 రోజులంటారా..?ఐసీసీ.. ఈ మ్యాచ్ జరిగిన విధానాన్ని చూసిన తర్వాత కూడా మీరు టెస్టులను నాలుగు రోజులకు కుదించాలనుకొంటున్నారా..?

## బాక్సింగ్‌లో మరో ఏడు పతకాలు ఖాయం



బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిపలో మరో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలు ఖరారు చేసుకున్నారు. మంగళవారం జరిగిన అండర్–19 పోటీల్లో యషిక (51 కిలోలు), నిష (54 కి), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిక (65 కి), ఆకాంక్ష (70 కి), ఆర్తి కుమారి (75 కి) సెమీస్‌కు చేరారు.

## చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌కు అర్జున్, హారిక



చెన్నై: గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లపాటు సాగే ఈ టోర్నీలో 19 మంది జీఎంలు పాల్గొననున్నారు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి ఆడనున్నారు.

## బలమైన సంస్కృతిని పెంపొందించాలి



లండన్: నిరంతర కృషి, పురోగతితో బలమైన జట్టు సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని గంభీర్ సూచించాడు. 'జట్టులోకి ఎంతోమంది వస్తుంటారు.. పోతుంటారు. డ్రెస్సింగ్ రూమ్ సంస్కృతే అందరినీ ఆకర్షిస్తుంద'ని ఐదో టెస్ట్ ముగిసిన అనంతరం ఆటగాళ్లతో గౌతీ అన్నాడు. 2–2తో సిరీస్ సమం చేయడం అద్భుతమని కొనియాడాడు. మన నైపుణ్యాలను సానబెట్టుకొంటూ సాగితే.. సుదీర్ఘకాలం ఆధిపత్యం ప్రదర్శించవచ్చన్నాడు. ఈ సందర్భంగా 'ఇంపాక్ట్ ప్లేయర్' అవార్డును సుందర్‌కు జడేజా అందజేశాడు.

## కన్నీళ్లు.. గంతులు.. ఆలింగనాలు

లండన్: టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఎప్పుడూ సీరియస్‌గా కనిపిస్తుంటాడు.. విజయాలు దక్కిన సందర్భాల్లోనూ అతను పెద్దగా సంబరాలు చేసుకోవడాన్ని కూడా అభిమానులు చూసి ఉండరు. కానీ, సోమవారం ఓవల్ టెస్టులో భారత జట్టు గెలిచిన క్షణాన మాత్రం గంభీర్ సెలబ్రేట్ చేసుకున్న తీరు ఎంతో ఉద్విగ్నభరితమని చెప్పొచ్చు. ఎప్పుడూ గంభీరంగా కనిపించే గౌతీ.. భావోద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాడు. సంబరం పట్టలేక చిన్నపిల్లాడిలా ఎగిరి గంతులేశాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌ను హత్తుకొని ఆప్యాయంగా ముద్దాడాడు. తీవ్ర భావోద్వేగానికి గురైన గంభీర్.. గట్టిగా అరుస్తూ జట్టు విజయాన్ని తనివితీరా ఆస్వాదించాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో అత్యంత ఉద్వేగభరితంగా మారిన ఆ అపురూప క్షణాల వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. సోషల్ మీడియాలో



వైరల్‌గా మారిన ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు.. 'నిజంగా ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. కోచ్‌కు, జట్టుకు అభినందనలు' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## ఇక ఆ పదాన్ని మర్చిపోండి



లండన్: భారత క్రికెట్‌లో ఈ మధ్య కాలంలో పని ఒత్తిడి అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. దీనిలో భాగంగానే స్టార్ పేసర్ బుమ్రా ఐదు టెస్టుల సిరీసలో మూడింటికే పరిమితమయ్యాడు. అయితే ఇదంతా అపోహేనని సిరాజ్ నిరూపించాడని మాజీ కెప్టెన్ గవాస్కర్ అన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో ఈ హైదరాబాదీ మొత్తం ఐదు మ్యాచ్‌లనూ ఆడిన సంగతి తెలిసిందే. 'వర్క్‌లోడ్‌ను దరి చేరనీయకుండా సిరాజ్ బౌలింగ్ వేసిన తీరు అద్భుతం. కెప్టెన్ ఎప్పుడు బంతి ఇచ్చినా సుదీర్ఘ స్పెల్‌లు వేశాడు. ఇక భారత జట్టు ఆ పదాన్ని తమ డిక్షనరీ నుంచి తొలగించాలి. ఎందుకంటే వర్క్‌లోడ్‌కు కట్టుబడితే అత్యుత్తమ ఆటగాళ్లను బరిలోకి దించలేం. మానసికంగా దృఢంగా ఉండడమే ముఖ్యం. అలాగే పంత్ గాయమైనా బ్యాటింగ్‌కు దిగాడు. సైనికులు తమకెదురయ్యే కఠిన పరిస్థితులపై ఫిర్యాదు చేస్తారా?' అని సన్నీ ప్రశ్నించాడు.

## కోహ్లీ, రోహిత్ సైడవ్వాల్సిందేనా



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో హోరాహోరీగా సాగిన ఐదు టెస్టుల సిరీస్ 2–2తో సమంగా ముగిసింది. అయితే, సుదీర్ఘంగా సాగిన సిరీసలో భారత యువ ఆటగాళ్ల పోరాటం హైలైట్‌గా నిలిచింది. దీంతో భారత జట్టులో వీరి స్థానాలు ఇక పదిలమేనన్న టాక్ బలంగా వినిపిస్తోంది. యువ కెరటాలు అనూహ్యంగా దూసుకురావడంతో.. వన్డేలు మాత్రమే ఆడాలనుకొంటున్న సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు దారులు క్రమంగా మూసుకుపోతున్నట్టు కనిపిస్తోంది. రాబోయే వరల్డ్‌కపనకు వీరిద్దరూ దాదాపుగా 40 ఏళ్లకు చేరువవుతుండడంతో.. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యువకులతో కోర్ టీమ్ తయారుచేయాలన్న నిర్ణయానికి బీసీసీఐ వచ్చిందని సమాచారం. కోహ్లీ, రోహిత్ భవితవ్యంపై బోర్డు కొద్దిరోజుల్లోనే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఇక ఆటగాళ్ల ఇష్టం కాదు

%న్యూఢిల్లీ: వర్క్‌లోడ్ మేనేజ్
బీసీసీఐ దృష్టి సారించింది.
వారి ఇష్టమొచ్చినట్టు మ్యా
'తమకిష్టమైనట్టుగా మ్యాచ్‌లన
ఆడే సెం ట్రల్ కాంట్రాక్ట్ ఆట



రం కావడంపై
మని, అయితే
ల్చి చెప్పింది.
న్ని ఫార్మాట్లలో
మేనేజ్‌మెంట్‌ను

పరిగణనలోకి తీసుకుంటాం. కానీ ఆ పేరుతో ముఖ్యమైన మ్యాచ్‌లకు దూరం కావడాన్ని సమ్మతించం' అని బీసీసీఐ అధికారి చెప్పారు.

# బిజినెస్



## ఆర్బీఐ కీలక ప్రకటన.. రెపో రేటు యథాతథం..




%బిజినెస్ డెస్క్: రెపో రేటు యథాతథంగా ఉంచాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ మేరకు రెపో రేటు 5.5 శాతం దగ్గరే కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిణామాలతో రెపో రేటు యథాతథంగా ఉంచినట్లు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటనల నేపథ్యంలో రెపో రేటు అలాగే ఉంచాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ప్రస్తుతం ద్రవ్యోల్బణం 4 శాతం వద్ద స్థిరంగా ఉందని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అది 3.1 శాతానికి తగ్గొచ్చని అంచనా వేశారు. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదవ్వొచ్చని పేర్కొన్నారు ఆర్బీఐ గవర్నర్. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటూ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నప్పటికీ భారత్ ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా ముందుకెళ్తోందని శుభవార్త చెప్పారు. అలాగే ఈ ఏడాది రుతుపవనాలు సమృద్ధిగా కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో వర్షాలు ఎక్కువగా కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని పేర్కొన్నారు. దీని వల్ల ద్రవ్యోల్బణం మరింత దిగువకు రానుందని ఎంపీసీ నిర్ణయాలను సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్బీఐ.. ప్రస్తుత సంవత్సరంలో రెపో రేటును 1 శాతం మేర తగ్గించిన విషయం తెలిసిందే.

## స్వల్పంగా తగ్గిన బంగారం.. ధరలు ఎలా ఉన్నాయంటే..



శ్రావణమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో గోల్డ్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. పసిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగారం ధర లక్ష రూపాయలను దాటేసి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈరోజు (ఆగస్టు 6న) ఉదయం 10:30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,230కి చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.92,794కి చేరుకుంది. అయితే, నిన్నటితో పోల్చుకుంటే గోల్డ్ ధర స్వల్పంగా తగ్గిందని చెప్పొచ్చు. %ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1,00,840కి చేరుకోగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ.92,437కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.101,170కి చేరుకోగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.92,739కి చేరింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం..

## సీసీఎల్ ప్రొడక్ట్స్ లాభం రూ.72 కోట్లు

సీసీఎల్ ప్రొడక్ట్స్... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,058.03 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.72.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.774.62 కోట్లుగా ఉండగా లాభం రూ.71.47 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.963.84 కోట్ల నుంచి రూ.687.44 కోట్లకు పెరిగాయి. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.537.55 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.31.36 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.



## టాటా క్యాపిటల్ రూ.17,200 కోట్ల ఐపీఓ




న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) టాటా క్యాపిటల్ నవీకరించిన ఐపీఓ పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సెబీకి సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 200 కోట్ల డాలర్ల (రూ.17,200 కోట్లు) వరకు సమీకరించాలని భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కన కంపెనీ మార్కెట్ విలువ దాదాపు 1,100 కోట్ల డాలర్ల (రూ.94,600 కోట్లు) స్థాయిలో ఉండనుందని వారన్నారు. సెబీకి సోమవారం సమర్పించిన అప్‌డేటెడ్ డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా టాటా క్యాపిటల్ మొత్తం 47.58 కోట్ల షేర్లను విక్రయించనుంది. అందులో 21 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రమోటర్లు, ఇతర వాటాదారులకు చెందిన 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన అమ్మకానికి పెట్టనుంది. ఓఎఫ్ఎసలో భాగంగా కంపెనీ ప్రమోటరైన టాటా సన్స్ తన వాటా నుంచి 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను ఉపసంహరించుకోనున్నాయి. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్ 88.6 శాతం, ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ టైర్-1 మూలధన నిధులను పెంచుకునేందుకు, భవిష్యత్ మూలధన అవసరాలు, రుణ వితరణ కోసం వినియోగించుకోనుంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ముందు జాగ్రత్తగా ఇంధనం, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎసఈ సెన్సెక్స్ మంగళవారం ట్రేడింగ్‌లో 308.47 పాయింట్లు కోల్పోయి 80,710.25 వద్దకు జారుకుంది. నిఫ్టీ 73.20 పాయింట్ల నష్టంతో 24,649.55 వద్ద ముగిసింది. ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసల నష్టంతో రూ.87.88 వద్ద ముగిసింది. భారత వస్తువులపై సుంకాలను మరింత పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

## బ్రిటన్‌కు మరిన్ని మత్స్య ఎగుమతులు



న్యూఢిల్లీ: భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన దేశ మత్స్య ఎగుమతులకు బాగానే కలిసి రానుంది. ప్రస్తుతం బ్రిటన్ మన దేశం నుంచి ఎగుమతయ్యే మత్స్య దిగుమతులపై 8.9 శాతం చొప్పున దిగుమతి సుంకం విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఈ సుంకం పూర్తిగా రద్దు కానుంది. దీంతో ప్రస్తుతం ఏటా బ్రిటన్‌కు రూ.1,000 కోట్ల వరకు ఉన్న మన మత్స్య ఎగుమతులు వచ్చే మూడేళ్లలో మూడింతలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎఫ్‌టీఏ తీర ప్రాంతం ఎక్కువగా ఉన్న గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బాగా మేలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే రొయ్యల ఎగుమతుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ఏపీ నుంచే ఎగుమతవుతాయి. ట్రంప్ సుంకాలతో బేల చూపులు చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతిదారులకూ భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ కలిసిరానుంది. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో బ్రిటన్‌లోని దిగుమతిదారులు ధరలు తగ్గించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎయిర్‌టెల్ లాభంలో భారీ వృద్ధి

భారతి ఎయిర్‌టెల్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.49,463 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5,947.9 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 28.4%, లాభం 43% పెరిగాయి. ఒక్కో కస్టమర్‌పై సగటు ఆదాయం (ఆర్పు) గత ఏడాదితో పోల్చితే రూ.211 నుంచి రూ.250కి పెరిగింది. పోస్ట్ పెయిడ్ సబ్‌స్క్రైబర్లు పెరగడంతో నిర్వహణాపరమైన లాభం 54 శాతం పెరిగినట్టు తెలిపింది.

## ఫార్మా దిగుమతులపై 250శాతం సుంకాలు..

### ధరలు తగ్గిస్తే సరి..లేదంటే టారిఫ్ పోటు తప్పదు
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో బాంబు పేలుస్తున్నారు. తాజాగా ఆయన దృష్టి ఫార్మా కంపెనీలపై పడింది. ఈ కంపెనీలు.. అమెరికాలో ఔషధాల ఉత్పత్తి పెంచి ధరలు తగ్గించాలని కోరారు. లేకపోతే భారీ సుంకాల పోటు తప్పవని హెచ్చరించారు. సీఎన్‌బీసీ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. 'ప్రారంభంలో ఈ సుంకాల పోటు కొద్ది స్థాయిలోనే ఉంటుంది. ఏడాది, ఏడాదిన్నర తర్వాత ఇది 150 శాతం, ఆ తర్వాత 250 శాతం వరకు ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అమెరికాలో ఔషధాల ధరలు మూడింతలు ఎక్కువగా ఉన్నందున, వాటి ధరలు తగ్గించక తప్పదని ట్రంప్ ఈ ఏడాది మార్చిలో హెచ్చరించిన విషయం తెలిసిందే. భారత్‌పై ప్రభావం: ట్రంప్ తాజా హెచ్చరిక భారత ఫార్మా కంపెనీలకు గుబులు పుట్టిస్తోంది.



TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006